# విరహతాపం

[ లేఖకుడు : "భగవాన్" ]

"ఎవ్వరూ! ఆ! శశీ! నువ్వా! శశివేనా? ఎప్పుడొచ్చావ్? ఏలా వచ్చావ్? శశీ!!... మాట్లాడవేం? నవ్వుతా వెందుకు అలాగు?"

"ఏం? రాకూడదా?"

"ఇంతరాత్రిలో...ఒంటరిగా."

"ఒంటరిగా వచ్చానంటావా"

"మరి..."

"బయటికిరా. చూపిస్తాను"

"ఏమీలేదే!"

"కనిపించడంలేదా? ఈఒలికిపోతున్న పండు వెన్నెలతోడుగా వచ్చింది నాతో."

"శశీ! మరి......కోపంవస్తుందేమో."

"లేక, కాళ్ళుముడుచుకొని, గాలిలేక, శాంతి లేక, విసుగుతో, చెమటతో ఆచీకటిగదిలో పరుండ మంటావా ఒంటరిగా?"

"నీ కిటికీప్రక్కనున్న నారింజపువ్వు సువాసన నిన్ను మైమరపించలేదూ! కొబ్బరిఆకు ఈనెల మీదనుండి నీమీదకు ప్రాకే గానము నీకు జోలపాట పాడలేదూ?"

"నీవు ప్రక్కనలేవుగా."

"నల్లమబ్బు పాలచంద్రుని నిద్రపుచ్చినప్పుడు, నీ పాలరేకులు నీకన్ను మూయలేదా?"

"నీకోసం, చూచి, చూచి నిద్రనే మరచి పోయింది."

"నిత్యకళ్యాణంలో జలకమాడే నీ సుకుమార వదనం అలసిపోలేదూ?"

"నందనవనంలో నాట్యమాడే నీ నటనకు నర్తకిచేయి కల్పడానికి వచ్చింది."

"నాట్యం ప్రారంభిద్దామా?"

"............?"

"శశీ!"

"వేణూ!"

"..........."

* * *

"ఏమి శశీ! ఎన్ని సార్లు ఈ విధంగా ఈ వెన్నెట్లో తళతళ మెరుస్తూ తరలిపోయే ఈ సెలయేటి సామీప్యంలో, ఈ పచ్చని గడ్డిపాన్పుపై, ఈ కీటక కిలకిలా రావముల మధ్య, సువాసనలు వెదజల్లే ఈ లతామందిరాల్లో, మేలిముసుగులోనున్న ఈ మల్లె మొగ్గల సౌరంభంలో, ఈ నిశ్శబ్దప్రకృతి సౌంద ర్యంలో ఎన్నిసార్లు వెచ్చగా కాగిపోతున్న నీ అధ రాలపై నా మెత్తని పెదవులు నాట్యంచేసినై."

"ఆ మధుర నాట్యప్రవాహాన్ని నిరంతరాయంగా ప్రవాహింపచేయమని ఈశ్వరుణ్ణి ఎప్పుడూ ప్రార్థి స్తాను వేణూ."

"శశీ! ఈ ప్రవాహం ఎంతవరకు సాగిపో తుందో, ఏదీ భవిషత్తు చెప్పతాను."

"జ్యోతిష్కులు కూడానా తమరు!"

"కుడి చెయ్యిగాదు — ఎడమ."

"సరే మీదొంగటక్కరి నాకు తెలుసుగాని-"

"ఇందులో టక్కరితనం ఏముంది? నీవు తెలుసుకున్న దేముంది? సరేకాని, మరి...కట్నం?"

"చెప్పనా?...సందేహమెందుకు?"

"ఏదీ! ఒక్క...!"

"అబ్బ! ఏదో క్రొత్తకట్నం కాబోలని భయపడ్డాను. మామూలు కట్నమేగా?"

"ఆ! నీకట్నం ఎప్పటికప్పుడు నాకు క్రొత్త రుచులు ప్రాసాదిస్తుంది. కా....ని,....శ—శీ!!"

"వేణూ !"

"నిద్రాహారాలుమాని నీవెక్కడున్నా నీకోసం ఎదురుతెన్నులు చూస్తుంటాను. ఇక్కడే ఇల్లు కట్టుకొని నివసిస్తాను. ఎప్పుడూ నీవు నావద్దనే ఉండరాదూ !"

"అలాగే ఉంటానుగాని. తమరిజ్యోతిష్యం ? దానిమాట ఏమైంది ప్రభూ ?"

"రాజ్ఞి శెలవా ?"

"ముందే కట్నం చెల్లించానే."

"సరిసరి అప్పుడే ఏమయింది. ఏదీ నీచెయ్యి. జాగ్రత్తగా వినాలిసుమా ! నీ మనస్సులో ఏదో ఆందోళనగా నుంది. ప్రేమిస్తున్న ప్రియుణ్ణి పెండ్లి చేసుకొనుటకు వీలవుతుందా, లేదా, అని". అంతే కదూ ?"

"అహాహా ! అపరబ్రహ్మలు మీరు."

"నాకు కావలసింది—నేను గాఢంగా వాంఛించేది నీపాగడ్త కాదు. ఆ, నీ, కట్నం."

"ఎన్నిసార్లు ?"

"మరొక్కసారే,"

"అబ్బ ! వీల్లేదు."

"అంటూ నిర్దయగా నీవు తోసిన తోపుకు మంచంమీదనుండి దభేలున క్రిందపడ్డాను. శశీ ! ఎంతపనిజేసావు ? కలలో కూడా నన్ను భ్రమపెట్టుతున్నావు. రాత్రి వెన్నెల్లో నీకు నెచ్చలిగా, నిన్ను విడనాడకుండా ఎల్లప్పుడూ నిన్ను అంటిపెట్టుకొని ఉండే (ఆవెచ్చని వెన్నెట్లోనే) నిన్నుతలస్తూ నిద్రపోయా. తెల్లవారుజామున వీచే చల్లని మలయమారుతాల కౌగిళ్ళలో కలగన్నాను. కాని, ఫలితం ? నీవా చిక్కలేదు. అంతేకాదు, నన్ను భగ్నమనస్కుని జేసావు."

ఎంతోకాలం క్రితం నీకు వుత్తరంవ్రాసాను. నీనీడలుచూస్తూ ఈనాడు కలలుగంటూ మళ్ళీ నీకు వ్రాస్తున్నాను. శశీ !! ఏంచెయ్యను ? నీకు ఉత్తరం వ్రాయకుండా ఉండలేను. నీతలపులతో ఉక్కిరిబిక్కిరి అయిపోయే నా హృదయానికి అది కొంత వుపశాంతి. శరీరాన్ని శాంత ప్రశాంత వేళల్లో నీవు లేని యీ జీవితం వ్యర్థంగా, ఒంటరిగా, బరువుగా గడచిపోతో వున్నది. అదే నీ సాన్నిధ్యంలో అయితే కాలానికి కాళ్ళుండవు. ఆ వలపు తోటల్లో నివసిద్దాము. ఒకసారి రావు, శశీ!

మనిద్దరి నడుమను ప్రేమానుభవం కలుగజేసిన ఈశ్వరమూర్తికి నా ధన్యవాదాలు. ఆ నిర్మలప్రేమ నిలువునా నశించకుండా వుండాలని అతణ్ణి వేడుకుంటాను

నిజంగా నీ ప్రేమేలేకుంటే యీ లోకమే లేదు నాకు. శశీ ! నీవు దూరమయినకొలది యీ దుర్భర జీవితం మరింత ప్రేమతో నిండిపోతున్నది. గంభీర ఆకాశంనుండి రాలిపోయిన యీ తుషార బిందువుకు నీ అనురాగపల్లవం ఆశ్రయమిచ్చింది. ఇప్పుడా పల్లవం తొలగకపోతే-ఈ మంచుబిందువు ధూళింలో కలసిపోతుంది శశీ !

శశీ ! ఈ ఒంటరితనాన్ని సహించలేకపోతున్నా. నీ రాకకు నా మందిరం అలంకరించుకొని తొంగిచూస్తుంది. హృదయ ఫలకాలమీద చిత్రించిన స్వరూపాలను, మాపుచేయుడానికి మానవసాధ్యం కాదు శశీ !

శశీ !!!

రావూ ?

నీ "వేణు"